సాక్షి ఏలూరు

ఆదివారం : 27 : జూలై : 2025



ఉలిక్కిపడిన వరహాపట్నం

భూమిలో నుంచి వచ్చిన భారీ శబ్దం, మందుపాతర మాదిరి పేలుడుతో వరహాపట్నం గ్రామ ప్రజలు ఉలిక్కిపడ్డారు. 8లో ▸



వర్జీనియా ధర పతనం

వర్జీనియా పొగాకు వేలం ధరలు అమాంతంగా పడిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. 8లో ▸



మార్మోగిన గోవింద నామస్మరణ

గోకుల తిరుమల పారిజాతగిరిలో గిరి ప్రదక్షిణ మార్గాన్ని శనివారం వేదమంత్రోచ్ఛరణలతో ప్రారంభించారు. 8లో ▸

న్యూస్‌రీల్

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

ఏలూరు (టూటౌన్): వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజు అన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం వట్లూరు టీటీడీసీలో జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మొదటి విడతగా 97,200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. కో–ఆర్డినేటర్, జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గతేడాది తీసుకున్న చర్యలతో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. జెడ్పీ సీఈఓ భీమేశ్వరరావు, డ్వామా ఏపీడీ రాజశేఖర్, డీఎల్‌పీఓ, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

1 నుంచి ఆటో మ్యూటేషన్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని నగరపాలక సంస్థల్లో వచ్చేనెల 1 నుంచి ఆస్తి పన్నుల ఆటో మ్యూటేషన్ నిర్వహించనున్నట్టు ఏలూరు కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆటో మ్యూటేషన్‌తో ఆస్తి యజమానులకు సమయం ఆదా అవుతుందన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ కె.శివారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మార్పులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో పోలింగ్ స్టేషన్ల మార్పులు, అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల మార్పు, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పోలింగ్ స్టేషన్ల మార్పు కోసం 16, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు 123 ప్రతిపాదనలు అందాయన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, రాజకీయపక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో జెస్సీరాజ్ ప్రతిభ



సిల్వర్ మెడల్‌తో..

దెందులూరు: జోగన్నపాలెంకు చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీరాజ్ మాత్రపు అంతర్జాతీయ పోటీల్లో సత్తాచాటింది. దక్షిణ కొరియాలో జరిగిన 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ సోలో డాన్స్ సబ్ జూనియర్ విభాగ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఆమెను, కోచ్ సింహాద్రిని భారత రోలర్ స్కేటింగ్ సమాఖ్య కార్యదర్శి భగీరథకుమార్, ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి థామస్ చౌదరి, ఆంధ్రప్రదేశ్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ స్కేటింగ్ చైర్మన్ పవన్‌కుమార్, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు అభినందించారు.

వెల్ఫేర్ బోర్డు కోసం ధర్నాలు

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, పాత క్లయిమ్‌లు పరిష్కరించాలంటూ ఈనెల 28న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ డాంగే, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ చేపల్లి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తెలుగుదేశం కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే బిల్డింగ్ వెల్ఫేర్ ఫండ్ బోర్డును పునరుద్ధరిస్తామని, మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా హామీలను అమలు చేయలేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

నేడు ఎయిడెడ్ టీచర్ నియామక పరీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి, కోట్ల వెంకట రామయ్య బాలికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న 7 ఎయిడెడ్ టీచర్ పోస్టులకు ఆదివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో పరీక్ష జరుగనుంది. భీమవరం డీఎన్నార్ కాలేజీ అటానమస్, డీఎన్నార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్, తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు.

సంక్షామ హాస్టళ్లు

పెచ్చులూడిన శ్లాబ్‌లు.. ఎండైనా, వానైనా నేలపైనే నిద్ర.. డోర్లు లేని బాత్‌రూమ్‌లు.. గదుల్లో తిరగని ఫ్యాన్లు.. ఎటుచూసినా క్షీణించిన పారిశుద్ధ్యం.. ఇది జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల దుస్థితి. రెండు దుప్పట్లు, ప్లేటు, గ్లాసు మాత్రమే విద్యార్థులకు అందిస్తున్నారు. హాస్టళ్లు కారాగారాలను తలపిస్తున్నాయని, మీ ఇంట్లో పిల్లలను నేలపైనే పడుకోపెడతారా, ఎన్‌సీపీసీఆర్ ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదంటూ హైకోర్టు సీరియస్ అయినా, అప్పుడప్పుడు న్యాయమూర్తులు, న్యాయ విభాగాధికారులు తనిఖీలు చేసినా పరిస్థితుల్లో ఏ మార్పులు లేవు. పైగా రోజురోజుకూ సమస్యలు తీవ్రతరమవుతున్నాయి.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

వసతి.. అధోగతి

- భవనాలకు పెచ్చులూడిన శ్లాబ్‌లు
- నేలపైనే విద్యార్థుల నిద్ర
- తాగునీటికి కొరత.. అధ్వానంగా మరుగుదొడ్లు
- సమస్యల వలయంలో వసతి గృహాలు
- హైకోర్టు మందలించినా మారని అధికారుల తీరు
- జిల్లాలో ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితి

సాక్షి ప్రతినిధి, ఏలూరు : జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 59 బాలురు, బాలికల వసతి గృహాలు, 38 బీసీ బాలబాలికల వసతి గృహాలు, అలాగే 6 ఎస్టీ బాలబాలికల వసతి గృహాలు ఉన్నాయి. మొత్తంగా 103 హాస్టళ్లలో 16,400 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. 3వ తరగతి నుంచి పోస్టు మెట్రిక్ వరకు వసతి గృహాలు జిల్లాలో ఉన్నాయి. అయితే అత్యధిక శాతం వసతి గృహాలు ప్రభుత్వ భవనాలు, జంగారెడ్డిగూడెంతో పాటు మరికొన్ని చోట్ల అద్దె భవనాల్లో హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. 3, 4 తరగతి విద్యార్థులకు డైట్ ఛార్జీల పేరుతో రూ.1,150, 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,400, కాస్మోటిక్ చార్జీల కింద నెలకు ఎగువ తరగతి విద్యార్థులకు రూ.200, దిగువ తరగతి విద్యార్థులకు రూ.150 ఇచ్చేవారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం కాస్మోటిక్ కిట్లను కొనుగోలు చేసి ఇవ్వాలనే పేరుతో కాస్మోటిక్ చార్జీలకు ఎగనామం పెట్టింది. డైట్ చార్జీల చెల్లింపులు ఉన్నప్పటికీ అత్యంత నాసిరకం భోజనం తప్ప పౌష్టికాహారం అందని పరిస్థితి. వీటితో పాటు బాత్‌రూమ్‌లకు తలుపులు లేకపోవడం, అలాగే ఆర్‌ఓ ప్లాంట్లు మరమ్మతులు నోచుకోక, పలుచోట్ల తిరగని ఫ్యాన్లతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.



బయట నుంచి నీళ్ల క్యాన్ తీసుకువెళుతూ..



హాస్టల్ గదిలో ఫ్యాన్ లేని దృశ్యం



ఏలూరు శాంతినగర్‌లోని బీసీ కళాశాల హాస్టల్‌లో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు



ఏలూరు అమీనాపేట ఎస్సీ హాస్టల్‌లో టాయిలెట్స్

సమస్యలు కోకొల్లలు

- ఏలూరు శాంతినగర్ బీసీ బాలుర హాస్టల్‌లో ఫ్యాన్లు మరమ్మతులు చేయకపోవడం, బాత్‌రూమ్‌లకు తలుపుల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు బయట నుంచి కొనుగోలు చేసి తీసుకురావాల్సిన పరిస్థితి.
- చింతలపూడి నియోజకవర్గంలో 8 ఎస్సీ హాస్టళ్లు, 3 బీసీ హాస్టళ్లు, ఒక ఎస్టీ హాస్టల్‌లో కలిపి మొత్తం 1,700 మంది విద్యార్థులు ఉన్నారు. వర్షం పడినా, చలికాలం వచ్చినా చలికి వణుకుతూ వీరు పడుకోవాల్సిందే. మంచాలు, కనీసం చాపలు కూడా లేని పరిస్థితి. ఇక మరుగుదొడ్ల మొదలు పరిసరాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా క్షీణించింది.
- జంగారెడ్డిగూడెంలో 29 మంది విద్యార్థులుండే బీసీ హాస్టల్‌లో విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. కామవరపుకోటలో పాత భవనాల్లోనే నెలకు రూ.19 వేల అద్దెతో ఎస్సీ, బీసీ వసతి గృహాలు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే విద్యార్థులకు అగచాట్లే. తలుపులు, కిటికీలు లేకపోవడం చలి గాలులతో ఇబ్బంది పడుతున్నారు.
- దెందులూరు నియోజకవర్గంలోని శింగవరంలో ఎస్సీ బాలికల హాస్టల్‌లో 65 మంది విద్యార్థులున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం తరుచూ పెచ్చులూడుతుండటంతో నిత్యం ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి.
- నూజివీడులో ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వకపోవడంతో 45 రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నారు. నూజివీడులో ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో 9 మంది సిబ్బందికి నలుగురే పనిచేస్తుండటం, 220 మంది ఉన్న వసతి గృహాన్ని ఇద్దరు వార్డెన్లే అరకొర సౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు.
- పోలవరం నియోజకవర్గంలోని కేఆర్‌పురంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉన్న ఎస్టీ బాలుర వసతి గృహం నిర్మించి 52 ఏళ్లు అయ్యింది. భవనం పూర్తిగా పెచ్చులూడి తరుచూ విద్యార్థులపై పడుతున్నా అధికారుల స్పందన శూన్యం. రూ.2.57 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో పాటు గుమ్మాలు, కిటికీలు పూర్తిగా పాడైపోయాయి.
- భీమడోలు మండలంలో వసతి గృహాల్లో విద్యార్థులు భయంగా గడుపుతున్నారు. కొన్నేళ్ల క్రితం గుండుగొలనులో హాస్టల్ కూలినప్పటి నుంచి 72 మంది విద్యార్థులు హైస్కూల్‌కు మకాం మార్చారు. చేబ్రోలులోని వసతి గృహం గోడలు బీటలు వారి శిథిలావస్థకు చేరింది. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా దుప్పట్లు, కాస్మోటిక్స్, నోటు పుస్తకాలు ఇవ్వని పరిస్థితి.

జిల్లాలో హాస్టళ్లు	
సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో	59
బీసీ హాస్టళ్లు	38
ఎస్టీ హాస్టళ్లు	6
మొత్తం విద్యార్థులు	16,400



బుట్టాయగూడెం మండలంలో గిరిజన సంక్షేమ హాస్టల్‌లో ఆరు బయటే భోజనం చేస్తున్న విద్యార్థులు

వాగులే ఆవాసం.. పాములే ఆహారం



- అత్యంత ప్రమాదకరం గిరినాగులు
- పాపికొండల అభయారణ్యంలో సంచారం

గిరినాగు (కింగ్ కోబ్రా) అత్యంత ప్రమాదకరమైన సర్పం. దట్టమైన అటవీ ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి. అరుదైన సర్పజాతికి చెందిన గిరినాగులకు ఇతర పాములే ఆహారం. వర్షాకాలంలో పాములను తినేందుకు ఇవి బయటకు వస్తుంటాయి. పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు సమీపంలో వీటి జాడ ఎక్కువగా ఉన్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. అరుదైన గిరినాగులు కనిపిస్తే చంపవద్దని, తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

సండే స్పెషల్

బుట్టాయగూడెం : ఏలూరు, అల్లూరు సీతారామరాజు జిల్లాల మధ్య 1,01,200 హెక్టార్ల పరిధిలో పాపికొండల జాతీయ వన్య మృగ అభయారణ్యం విస్తరించి ఉంది. అరుదైన జంతు జాలానికి నిలయంగా ఉన్న ఈ అభయారణ్యంలో గిరి నాగుల సంచారం ఎక్కువగా ఉంది. దట్టమైన అటవీ ప్రాంతాలకు పరిమితమయ్యే ఈ సర్పాలు అత్యంత విషపూరితం. అలాగే ఇవి అరుదుగా కనిపిస్తాయి. అయితే ఇటీవల ఇవి జనావాసాల్లోకి వస్తున్నాయి. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో గిరినాగులు కనిపించినట్టు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు పరిసర ప్రాంతాలు వీటికి అడ్డాగా మారాయని వైల్డ్ లైఫ్ అధికారులు అంటున్నారు.

ఆహారం కోసం బయటకు..

మార్చి నుంచి జూలై వరకు గిరినాగులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అటవీ ప్రాంతంలో జల వనరులు తగ్గినప్పుడు నీటి చెమ్మను వెతుక్కుంటూ బయటకు వస్తుంటాయి. రబీ సీజన్ అనంతరం ఇతర పాములు పొలాల్లో ఉండటంతో ఆహారం కోసం వాటిని వెతుక్కుంటూ గిరినాగులు వస్తుంటాయి. గతేడాది వర్షాకాలంలో బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం సమీపంలో, ఇనుమూరు, జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం అటవీ ప్రాంతంలో, ఇటీవల గడ్డపల్లి, ముంజులూరు, తంగేడికొండ, దారావాడ, కోండ్రుకోట అటవీ ప్రాంతాల్లో గిరినాగులు కనిపించినట్టు ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. పాపికొండల అభయారణ్యంలో గిరినాగులతో పాటు పది అడుగుల తాచు పాములు, రక్తపింజర వంటి ప్రమాదకరమైన పాములు కూడా ఉన్నాయి.

పట్టుకుని అడవిలో వదిలేస్తూ..

ఇటీవల కాలంలో వర్షాకాలంలోనూ గిరిజనులు పొలాల్లో సంచరిస్తున్నాయి. వీటి సమాచారం అందిస్తే ఫారెస్ట్ అధికారులు వాటిని పట్టుకుని మళ్లీ అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. ఇవి అరుదైన పాములు కావడంతో వాటి సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

- గిరినాగులు 14 నుంచి 20 అడుగుల పొడవు ఉంటాయి.
- మగ గిరినాగులను ఆకర్షించేందుకు ఆడ గిరినాగులు ఫెరోమోన్స్ అనే రసాయన పదార్థాన్ని వెదజల్లుతాయి. ఆ వాసన బట్టి మగ గిరినాగులు వాటిని అనుసరిస్తాయి.
- గిరినాగులు కాటు వేస్తే 10 నిమిషాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.
- గిరినాగులు రక్తపొడ, తాచుపాము, కట్లపాము, జెర్రిగొడ్డు వంటి పాములను ఆహారంగా స్వీకరిస్తాయి.
- గిరినాగులు గుడ్లు పెట్టి 18 రోజులపాటు పొదుగుతాయి. 21వ రోజున పిల్లలు బయటకు వస్తాయి.
- పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు ప్రాంతంలో వీటి సంచారం ఎక్కువగా ఉంది.

కనిపిస్తే సమాచారం ఇవ్వండి



పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గిరినాగులు కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వండి. ప్రాణభయంతో పాములను చంపవద్దు. మాకు సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తాం. ఈ పాములు అరుదైనవి. అభయారణ్యంలో వణ్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– ఎస్‌కే వల్లీ, రేంజ్ అధికారి, పోలవరం

అత్యంత ప్రమాదకరం



గిరినాగులు అత్యంత ప్రమాదకరం. వీటిని పట్టుకోవడం అంత సులువు కాదు. పాపికొండలు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో ఇవి కనిపిస్తున్నట్టు ఫోన్‌లు వస్తున్నాయి. గిరినాగు కనిపిస్తే ఎవరూ చంపవద్దు. 8099855153 నంబర్‌కు ఫోన్ చేస్తే నేను వచ్చి పట్టుకుని వాటిని అడవిలో వదిలేస్తా.

– చదలవాడ క్రాంతి, స్నేక్ సేవియర్స్ సొసైటీ వ్యవస్థాపకుడు, జంగారెడ్డిగూడెం

20 అడుగుల పొడవు



గిరినాగు పాము చాలా ప్రమాదమైంది. 20 అడుగుల పైగా పొడవు ఉంటుంది. బాగా ముదిరిన పాము చాలా డేంజర్. నేను చాలాసార్లు వాటిని చూశాను. అటవీ ప్రాంతంలో పర్యటించినప్పుడు అవి కనిపిస్తే పరుగులు తీసేవాళ్లం.

– ఎస్.ప్రసాద్, బుట్టాయగూడెం


మనుషులపై దాడి చేయవు




గిరినాగులు సాధారణంగా మనుషులపై దాడి చేయవు. అయితే వాటిని భయపెట్టడం లేదా రెచ్చగొట్టడం చేస్తే కాటు వేస్తాయి. ఇది చాలా విషపూరితమైన పాము. కాటు వేస్తే మరణమే తప్ప జీవించే అవకాశం ఉండదు. చాలా జాగ్రత్తగా ఉండాలి.

– గంధం విక్టర్, బుట్టాయగూడెం

మళ్లీ పెరిగిన గోదావరి



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి



వేలేరుపాడులో నీటమునిగిన ఎద్దెలవాగు వంతెన

వేలేరుపాడు: ఎడతెరపి లేని వర్షాలకు వాగు లు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద శనివారం రాత్రి 35.40 అడుగులకు నీటిమట్టం చేరింది. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే దారిలోని ఎద్దెలవాగు వంతెన ఉదయమే నీటమునిగింది. దీంతో దిగువన ఉన్న 18 గిరిజన గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కొయిదా, కట్కూరు, కాచారం, తాళ్ల గొంది, పూసుగొంది, చిట్టంరెడ్డిపాలెం, ఎడవల్లి, బుర్రెడ్డిగుడెం, టేకూరు, సిద్దారం, కుంకుడు కొయ్యలపాకలు మరో ఏడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ ఎద్దెలవాగు వద్ద నాటు పడవను ఏర్పాటుచేశారు.

5.53 లక్షల క్యూసెక్కులు దిగువకు..

పోలవరం రూరల్: పోలవరం వద్ద గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. ప్రాజెక్టు దిగువన స్పిల్‌వే వద్ద 30.400 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 5.53 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వదులుతున్నారు. దీంతో దిగువన వరద ప్రవాహం పెరుగుతోంది. భారీ వర్షాలతో మరో రెండు రోజుల పాటు వరద పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

గళమెత్తిన ఉపాధ్యాయులు



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ బదిలీ అయిన టీచర్లకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, కేడర్ అప్‌డేట్ చేయలేదని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, పలు శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని గళమెత్తారు. వెంటనే ఉపాధ్యాయులకు జీతాలు వచ్చేలా చూడాలని లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ఏలూరు(మెట్రో): ఏపీపీఎస్సీ ద్వారా ఆదివారం నుంచి ఆగస్టు 1 వరకు జరిగే పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏపీపీఎస్సీ 04/2025 నోటిఫికేషన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి ఆలయం



భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైనరోజు, అందులోనూ గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం తగ్గడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట, ఉచిత ప్రసాద వితరణ క్యూలైన్లు, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో పోటెత్తాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని వేదికపై ఎన్‌టీఆర్ జిల్లా, మునగపాడు గ్రామానికి చెందిన శ్రీ రామాంజనేయ భజన భక్త సమాజం సభ్యులు నిర్వహించిన భజనలు భక్తులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

పెంటపాడు: ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయ ఇంగ్లీషు మీడియం స్కూల్లో శనివారం అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొనగా 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి జి. శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

మరో వ్యక్తి పరిస్థితి విషమం

బంటుమిల్లి: పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించగా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు రోడ్డుపై పడిపోయారు. ప్రమాద తీవ్రతకు ద్విచక్ర వాహనాలు ఒక దానికొకటి ఇరుక్కుపోయి రోడ్డుపై చిందరవందరగా పడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు పోలీసులకు, 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై గణేష్‌కుమార్ ప్రమాదానికి కారణాలను విచారిస్తున్నారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన చెరుకుమిల్లి శివకుమార్(25), గుర్రం పవన్ కుమార్ తాపీ మేస్త్రిలుగా పని చేస్తున్నారు. యానాం నుంచి జంక్షన్ వైపు వస్తుండగా, కృత్తివెన్ను మండలం అడ్డపర్ర గ్రామానికి చెందిన నరేష్(25) బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. శివకుమార్ ఘటనా స్థలంలో మృతి చెందగా, నరేష్ ఆస్పత్రిలో మరణించాడు. పవన్‌కుమార్‌కు బందరు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వర్జీనియా ధర పతనం

రూ.390 నుంచి రూ.370కి పడిపోయిన ధర

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు వేలం ధరలు అమాంతంగా పడిపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. శనివారం కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన కొనుగోళ్లలో నాణ్యమైన పొగాకు ధర కేజీకి రూ. 390 నుంచి ఒక్కసారిగా రూ.370కు పడిపోవడంతో రైతులు నిరుత్సాహానికి గురయ్యారు. పొగాకును కొనుగోలు చేసే ప్రధాన కంపెనీకి చెందిన అలయన్ కంపెనీ కొనుగోళ్ల నుంచి తప్పుకోవడం ధరల పతనానికి కారణంగా తెలిసింది. దీంతో మిగిలిన కొనుగోలుదారులు ఇదే అదునుగా భావించి పొగాకు ధరను తగ్గించి కొనుగోలు చేయడానికి సిండికేట్‌గా మారారని రైతులు ఆరోపించారు. మార్చి నెలలో రూ. 290తో ప్రారంభమైన వర్జీనియా పొగాకు కొనుగోలు సుమారు 4 నెలలకు గాని రూ.390కు చేరుకోలేకపోయిందన్నారు. కాగా ధర మరింత పతనం అయ్యే అవకాశం ఉందని, ఇందుకు కంపెనీలు సిద్ధం అవుతున్నాయని ప్రధాన కంపెనీలోని ప్రైవేటు ఉద్యోగి ఒకరు పేర్కొన్నారు. విదేశీ ఆర్డర్లు లేవంటూ సాకు చూపిస్తున్నారని క్లూ ఇచ్చారు. ఇచ్చిన అనుమతుల కంటే పరిమితికి మించి పంటను ఉత్పత్తి చేయడం వలన ఏర్పడిన సంక్షోభం ఇది అని బోర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.



కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లు నిర్వహిస్తున్న దృశ్యం

ధర పతనంతో ఆందోళన



ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఎదురైంది. గతంలో కంటే కూడా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేశాం. బోర్డు అధికారుల సూచనలు పాటిస్తూ అన్య పదార్థాలు లేకుండా గ్రేడ్ వన్ పొగాకు ఉత్పత్తి చేసి మద్దతు ధర ఆశించాం, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధర పతనం చూస్తుంటే ఆందోళన కలుగుతుంది.

– కాకర్ల వివేకానంద, వర్జీనియా పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు, కొయ్యలగూడెం

సగం కూడా కొనుగోలు చేయలేదు



ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల్లో సుమారు 82 మిలియన్ల కేజీల పొగాకు విక్రయించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు అందులో సగం కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతుల వద్ద మిగిలి ఉన్న పొగాకు నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. లోగ్రేడ్ ధర రూ.250కు దిగజారకుండా ఉండగలిగితే రైతుకు కొంతైనా ప్రయోజనం చేకూరుతుంది.

– పరిమి రాంబాబు, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం

ఉలిక్కిపడిన వరహాపట్నం

- భూమి నుంచి భారీ పేలుడు
- బాంబులంటూ భయపడిన ప్రజలు
- ముగ్గురికి స్వల్ప రాళ్ల గాయాలు
- బాంబ్, డాగ్ స్క్వాడ్‌ల పరిశీలన

కైకలూరు: భూమి నుంచి వచ్చిన భారీ శబ్దం.. మందుపాతర మాదిరిగా పేలడంతో శనివారం వరహాపట్నం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బాంబులంటూ ప్రజలు భయాందోళన చెందారు. వివరాల ప్రకారం వరహాపట్నం నుంచి కలిదిండి వెళ్లే రహదారిలో కూడలి వద్ద సేద తీరే సిమెంటు బెంచీపై ఉదయం ముగ్గురు యువకులు కూర్చుని కబుర్లాడుకుంటున్నారు. ఇంతలో సమీప భూమి నుంచి రెండు లారీ టైర్లు ఒక్కసారిగా పేలిన శబ్దం వచ్చింది. ఆ ప్రాంతమంతా దుమ్ముతో నిండిపోయింది. బెంచీపై కూర్చున్నా కోనాల నానీ, పడమటి శివగణేష్, సోమగాని కార్తీక్‌లకు స్వల్పంగా రాళ్ల గాయాలయ్యాయి. గ్రామస్తులు రూరల్ ఏఎస్సై వెంకటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన సిబ్బందితో వచ్చి గాయపడిన యువకుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఏలూరు నుంచి బాంబు, డాగ్ స్క్వాడ్‌లు వచ్చాయి. పొక్లెయిన్‌తో పేలుడు సంభవించిన ప్రాంతాన్ని తవ్వి బాంబుకు సంబంధించి ఎటువంటి ఆనవాళ్లు లేవని నిర్ధారించారు. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితం వర్షపు నీరు వెళ్లడానికి పేలుడు సంభవించిన కొంత దూరంలో డ్రెయిన్‌ను తవ్వారు. పేలుడు జరిగిన చోట గతంలో మెకానిక్ షెడ్, ఎలక్ట్రికల్ రిపేరు షాపు ఉండేదని గ్రామస్తులు చెప్పారు. భూమిలో బ్యాటరీ కాని, భూమి అడుగున కూల్ డ్రింక్ సీసాలలో గ్యాస్ వల్ల పేలుడు సంభవించి ఉండవచ్చని భావిస్తున్నారు. హఠాత్తుగా జరిగిన పరిణామంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ప్రజలు భయపడవద్దని పోలీసులు చెప్పారు.



పేలుడు ప్రాంతం వద్ద పొక్లెయిన్‌తో తవ్వుతున్న దృశ్యం



పేలుడు ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్ పరిశీలన

నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక



నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ శివకిషోర్, న్యాయ, ఎక్సైజ్, రవాణా శాఖ ఉన్నతాధికారులు

- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్
- అర్ధ సంవత్సర నేర సమీక్ష, కోఆర్డినేషన్ సమావేశం

ఏలూరు టౌన్: నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అధ్యక్షతన ఏలూరు జిల్లా అర్ధ సంవత్సర నేరసమీక్ష, కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, పురోగతి, నిందితుల అరెస్టులు, కోర్టుల్లో చార్జిషీటు దాఖలు వంటి అంశాలపై పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీక్లీ ప్రోగ్రెస్ రిపోర్ట్ తయారు చేసుకుంటే దర్యాప్తు వేగంగా పూర్తి అవుతుందన్నారు. పోక్సో కేసులు, బాలికల మిస్సింగ్ కేసుల్లో 90 శాతం దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. పోక్సో కేసుల్లో 60 రోజుల్లో కేసుల దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేయాలని, నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రాసిక్యూషన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శారదామణి మాట్లాడుతూ జిల్లాలో కోర్టు మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి ఎస్పీ శివకిషోర్ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయటంతో కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయని స్పష్టం చేశారు. దర్యాప్తులో పోలీస్ అధికారులు శ్రద్ధ చూపించటంతో ఇటీవల పోక్సో కేసుల్లో కఠిన శిక్షలు పడుతున్నాయని తెలిపారు. రవాణాశాఖ అధికారి కృష్ణారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ కేపీ శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, నేరాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులు బాధితులకు న్యాయం అందించేలా మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు జీజీహెచ్ అధికారి జాగీ, ఎక్సైజ్ జిల్లా అధికారి ఆవులయ్య, డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలియో కేసులు లేవు



పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

వేలేరుపాడు: జిల్లాలో ఎక్కడా పోలియో కేసులు నమోదు కాలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పీజే అమృతం చెప్పారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన వారిలో వేలేరుపాడు నుంచి వచ్చిన కొందరిలో పోలియో లక్షణాలు ఉన్నాయని మీడియాలో రావడంతో డీఎంహెచ్ఓ, పిల్లల వైద్యుడు, ఆర్థోపెడిక్ సర్జన్‌లతో కూడిన బృందం మేడేపల్లి, వేలేరుపాడు గ్రామాలను శనివారం సందర్శించి 75 కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ అమృతం మాట్లాడుతూ శుక్రవారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో సదరం శిబిరంలో 110 మంది అంగవైకల్య పరీక్షలకు హాజరుకాగా వారిలో 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఇద్దరు పిల్లలు సెరిబ్రల్ పాల్సీ, మెనింగోమైలోసెల్ (పుట్టుకతో వచ్చే రుగ్మత) అని, అది పోలియో కాదన్నారు. ఇతర కేసుల్లో కొందరికి 2008కి ముందు అవశేష పక్షవాతంతో జన్మించారన్నారు. ఏలూరు జిల్లాలో అక్యూట్ ఫ్లాసిడ్ పక్షవాతం పరీక్షను 7 మంది పిల్లలకు చేయడం జరిగిందని, వారిలో ఒకరు జంగారెడ్డిగూడెం నుంచి వచ్చారన్నారు. మల నమూనాలను సేకరించి చెన్నైలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపామని, అందులో పోలియో నెగెటివ్ అని నివేదిక వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరిగా పోలియో కేసు 2008 సంవత్సరంలో గుర్తించడం జరిగిందని, అప్పటి నుంచి ఏలూరు జిల్లాలో పోలియో కేసు నమోదు కాలేదన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో సదరం శిబిరంలో పరీక్షించిన కేసుల్లో ఏదీ పోలియో మైలిటిస్ కాదని డీఎంహెచ్ఓ డా.అమృతం స్పష్టం చేశారు.

2న జెడ్పీ సమావేశం

ఏలూరు(మెట్రో) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ముదినేపల్లి రూరల్: కాలువలో స్నానానికి దిగి గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం ఆచూకీ దొరికింది. వివరాల ప్రకారం మండలంలోని కాకరవాడకు చెందిన మరీదు వెంకటేశ్వరరావు ఈ నెల 24న బంధువు అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం స్నానానికి స్థానిక క్యాంపుబెల్ కాలువలో దిగి కొట్టుకుపోయాడు. దీనిపై బంధువులు, పోలీసులు గాలించగా శనివారం కాకరవాడ శివారు ఐనంపూడి వద్ద క్యాంపుబెల్ కాలువ ఒడ్డున వెంకటేశ్వరరావు మృతదేహాన్ని గుర్తించారు. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

పారిజాతగిరిలో మార్మోగిన గోవింద నామస్మరణ

ఆలయ గిరి ప్రదక్షిణ మార్గం ప్రారంభం



గిరి ప్రదక్షిణ మార్గాన్ని ప్రారంభిస్తున్న శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

జంగారెడ్డిగూడెం: భక్తుల గోవింద నామ స్మరణలతో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం పులకించింది. దేవస్థానంలో పారిజాతగిరి కొండ చుట్టూ నిర్మించిన ప్రదక్షిణ మార్గాన్ని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి విశేష భక్త జన సందోహం మధ్య శనివారం ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారిని దర్శించారు. ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాట్లను అభివృద్ధి కమిటీ సహకారంతో ఆలయ ఈవో కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, గిరి ప్రదక్షిణ మార్గానికి ఆర్థిక సహకారం అందజేసిన మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పార్టీ మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు గిరిప్రదక్షిణ చేశారు.

గంజాయి ముఠా అరెస్ట్

ఆకివీడు: స్థానిక వెంకయ్య వయ్యేరు కాల్వ గట్టు, ప్యాట్రిక్ నగర్, రైల్వే బ్రిడ్జి సమీపంలో ఐదుగురు వ్యక్తులు శనివారం గంజాయి క్రయ, విక్రయాలు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లికి చెందిన పోడియం జగదీష్ మణికంఠ, తణుకు మండలం దువ్వకు చెందిన ప్రదిక్షణం రవి 30 కిలోల గంజాయిని తీసుకువచ్చి చెరుకుమిల్లి గ్రామానికి చెందిన వేగేశ్న పవన్ కల్యాణ్ వర్మ, స్థానిక సమతానగర్‌కు చెందిన కొమ్మారెడ్డి సత్యనారాయణ, స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని నైనారు ప్రసాద్‌లకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. గంజాయి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ జగదీశ్వరరావు చెప్పారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది, ఆర్ఐ అంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.